క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటు

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంభిక సమేత ఆలయంలో సొంత నిధులు రూ.2.5 లక్షల ఖర్చుతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మదనపల్లె మండలం వలసపల్లెకు చెందిన తూగు సుకుమార్‌రెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి సోదరులు ఆదివారం సీసీ కెమెరాలను వితరణగా అందజేసి ఏర్పాటు చేశారు. వారి దాతృత్వాన్ని ఆలయ కమిటీ చైర్మన్ మల్లిరెడ్డి , ఈవో రమణ, పూజారులు ఈశ్వరప్ప, భక్తులు అభినందించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కలకడ : మండలంలో ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సిటిస్వామి తెలిపారు. వివరాలిలాఉన్నాయి. ఆదివారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ తోటిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ తన సిబ్బంది శ్రీనివాసులు ,రాజేంద్రనాయక్, తాతయ్య, కాంతారావు, మునిరాజ, రమేష్, సంజీవతో కలిసి దాడులు నిర్వహించారు. జూదరుల నుంచి రూ.8,310 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా అబ్రహం లింకన్ జయంతి



అబ్రహం లింకన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేవీవీ అధ్యక్షుడు, విద్యార్థులు

వాల్మీకిపురం: అమెరికా 16వ అధ్యక్షుడు అబ్రహం లింకన్ జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో కలసి అబ్రహం లింకన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ అబ్రహం లింకన్ అమెరికాను అప్పట్లో నడిపించిన తీరు ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాల్లో ప్రజాస్వామ్య నిర్మాణానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. కటిక పేదరికం నుంచి చదువుకొని అమెరికా అధ్యక్షుడు స్థాయికి ఎదిగారన్నారు. కార్యక్రమంలో వార్డెన్ భారతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూరమ్మకు పూజలు



ప్రత్యేకాలంకరణలో చింతలపూరమ్మ

పీలేరు రూరల్ : మండలంలోని కావలిపల్లె పంచాయతీ ఒంటిల్లు సమీపంలో వెలసిన శ్రీ చింతలపూరమ్మ దేవస్థానము జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. మూడు రోజులపాటు వివిధ రకాల పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు కొబ్బరికాయలు కొట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మసీ అధినేత నిత్యానంద రెడ్డి, లక్ష్మీదేవమ్మ, కల్యాణ్‌రెడ్డి, ప్రేమనాథరెడ్డి, ద్వారకనాథరెడ్డి, బాబురెడ్డి, సుధాకర్‌రెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

కలకడ : మహాశివరాత్రి ఉత్సవాలకు ఆదివారం కలకడ శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో అంకురార్పణ చేశారు. 11 రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించ నున్నట్లు ఆలయ ధర్మకర్త కేసర్ల అఖిలేష్ తెలిపారు. సోమవారం ధ్వజా రోహణం, మంగళవారం రావణ వాహనం, బుధవారం హంస వాహనం, గురువారం మయూర వాహనం , శుక్రవారం కల్యాణ మహోత్సవం, గజవాహనంపై అలంకరణ ఉంటుందని చెప్పారు. అలాగే శనివారం ఖరదీపము, లక్షబిల్వార్చన, ఆదివారం యాళివాహణం, 20వ తేదీ త్రినేత్ర దారణ, 21 వసంత్సోవం, 22న పార్వేట, 23న ధ్వజఅవరోహణంతో ఉత్సవాలను ముగించనున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

రాయచోటి టౌన్ : రోడ్డు ప్రమాదంలో లక్కిరెడ్డిపల్లెకు చెందిన చంద్రమౌలి కాలును కోల్పోయాడు. బాధిత కుటుంబానికి చేయూత అందించాలని తలంపుతో రాయచోటి జిన్నా సేవా సంస్థ అధ్యక్షుడు జిన్నా షరీఫ్‌రూ.10 వేల నగదును అందజేశాడు. గత నెలలో గువ్వల చెరువు ఘాట్‌లో తన భార్యతో కలసి కడపకు వెళ్తుండగా లారీ ఢీకొన్న సంఘటనలో ఆయన కాలు విరిగిపోవడంతో మంచానికే పరిమితయ్యాడు. భవిష్యత్తులో జీవనోపాధికి కూడా తన వంతుగా సహకరిస్తానని షరీఫ్ హామీ ఇచ్చాడు.

మట్టి ట్రాక్టర్లు స్వాధీనం

సంబేపల్లె : అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ షరీఫ్ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి మండల పరిధిలోని మోటకువాండ్ల పల్లె క్రాస్ సమీపంలో ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తుండగా తమ సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లతో పాటు జేసీబీలను అదుపులోకి తీసుకొన్నామన్నారు.

నత్తనడకన ఎన్‌హెచ్ 340 పెండింగ్ పనులు

- ఏడేళ్ల క్రితం ప్రారంభమైన పనులు
- గుర్రంకొండలో అసంపూర్తిగా డ్రైనేజీలు
- పట్టణంలో రెండేళ్లుగా పూర్తికాని లింకు రోడ్లు



గుర్రంకొండ పట్టణ బస్టాండు ముఖ చిత్రం



బస్టాండు వద్ద పెండింగ్‌లో ఉన్న మురుగునీటి కాలువ నిర్మాణాలు

గుర్రంకొండ: జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 340) పనులు టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమయ్యాయి. రాయచోటి నుంచి అంగళ్లు వరకు 54 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు అప్పట్లో ప్రారంభించారు. ఇందుకోసం రూ.356 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అన్ని చోట్ల పనులు పూర్తి చేసుకొని రెండేళ్ల క్రితం గుర్రంకొండ పట్టణంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే డ్రైనేజీలు, లింకు రోడ్డు నిర్మాణ పనులు పలుచోట్ల పూర్తి చేయలేదు. నాలుగు మండలాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న మండల కేంద్రమైన గుర్రంకొండ పట్టణానికి ప్రతిరోజు వేలాది మంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. రెండేళ్ల నుంచి పనులు పెండింగ్‌లో ఉంచడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అసంపూర్తిగా కాలువ నిర్మాణ పనులు

పట్టణంలోని బస్టాండు పరిధిలో ఎన్‌హెచ్ 340 రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు కి రువైపులా చేపట్టి మురుగునీటి కాలువల నిర్మాణపనులు కొన్ని చోట్ల పూర్తి చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. మురుగునీటి కాలువ నిర్మాణాలు రెండేళ్లుగా అక్కడక్కడా పెండింగ్‌లో ఉంచారు. మూడు నుంచి నాలుగు మీటర్ల దూరంలో అక్కడక్కడ మురుగు నీటి కాలువలు నిర్మించలేదు. దీంతో నెలల తరబడి పనులు పూర్తి కాక పోవడంతో బస్టాండులోని వ్యాపారస్తులకు చాలా ఇబ్బందిగా మారింది. దుకాణాల ముందు భాగంలో కాలువ నిర్మాణ కోసం తవ్వేసి వదిలేయడంతో ప్రజలు దుకాణాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని మురుగునీటితో పాటు వర్షపునీరు బయటకు వెళ్లే మార్గంలేక ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో కడప–బెంగుళూరు జాతీయ రహదారి మురుగునీటి మయంగా మారింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో పాటు పాదచారులు రోడ్లపైన నడవలేక నానా కష్టాలు పడుతున్నారు.

దెబ్బతిని కూలిపోతున్న కాలువలు

పట్టణంలోని పలు చోట్ల ఎన్‌హెచ్ 340 రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మించిన మురుగునీటి కాలువలు దెబ్బతిని కూలిపోయాయి. స్థానిక మార్కెట్ యార్డు సర్కిల్లో రెండు చోట్ల కాలువ పైకప్పు దెబ్బతిని పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. స్థానిక నవాజ్ సినిమాహాల్ పరిసరాల్లో రెండుచోట్ల కాలువ దెబ్బతిని పెద్ద ఎత్తున రంధ్రాలు ఏర్పాడ్డాయి. పట్టణంలో పలుచోట్ల కాలువలపై ఇదే పరిస్థితి నెలకొంది.

పూర్తి కాని లింకురోడ్లు

ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి నుంచి పట్టణంలోని పలు వీధులను కలుపుతూ గతంలో లింకు రోడ్లు వేయడానికి పనులు చేపట్టారు. అయితే రెండేళ్లుగా పనులు ముందుకు సాగక పెండింగ్‌లో ఉంచారు. దీంతో రోడ్లు మొత్తం కంకర తేలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోంది. ఇటు రోడ్డు కాంట్రాక్టర్లు అటు అధికారులు వీటిపై దృష్టి సారించడంలేదు. లింకు రోడ్డు పనులు పూర్తి చేసి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గుర్రంకొండ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులు కూడా త్వరగా పూర్తి చేయిస్తాం. కొద్దిరోజులుగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సబ్ కాంట్రాక్టర్లతో మాట్లాడి సమస్యలన పరిష్కరిస్తాం.

– రవీంద్రనాథ్,
ఎన్‌హెచ్340 ఏఈ, మదనపల్లె

జూదరుల అరెస్టు

కలికిరి: పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని గుట్టపాళెం గ్రామం కె.బరిణేపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఆదివారం ఉదయం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.16,320 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఘనంగా ఎర్రకోట గంగమ్మ ఊరేగింపు



రామసముద్రం: మండలంలోని ఎలవానెల్లూరు పంచాయతీ అనపల్లి గ్రామంలో శనివారం రాత్రి ఎర్రకోట గంగమ్మ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం చింతామణి సమీపంలోని ఎర్రకోట గ్రామం నుంచి గంగమ్మను తీసుకువచ్చి గ్రామంలో బ్యాండువాయిద్యాల నడుమ ఊరేగించడం ఆనవాయితీ. ఈ మేరకు ఆదివారం గ్రామంలో గంగజాతర ఏర్పాటు చేశారు. ఇంటింటా అమ్మవారికి శాంతిపూజలు చేశారు. గ్రామానికి ఎటువంటి కీడు జరగకుండా ఉండేందుకు అమ్మవారిని ఊరేగించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఎమ్మెల్యేకు విశ్రాంత ఉద్యోగుల వినతి



ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

వాల్మీకిపురం: విశ్రాంత ఉద్యోగుల సమావేశాలు నిర్వహించుకునేందుకు భవన ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఆదివారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి విశ్రాంత ఉద్యోగులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకునేందుకు సంఘాన్ని ఏర్పాటు చేసుకొన్నామని, సంఘ కార్యక్రమాలకు భవనం అవసరమన్నారు. ప్రభుత్వ స్థలం కేటాయిస్తే విరాళాల ద్వారా భవనాన్ని నిర్మించుకుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛం అందించి, దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు శంకర, సభ్యులు మస్తాన్ వలి, జవాద్ హుస్సేన్, నారాయణ, సరధి, బివి రమణ, నాగరాజ, క్రిష్ణమూర్తి, బషీర్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనడివీధి గంగమ్మ జాతర



అమ్మవారికి దివిటీలు, బోనాలు సమర్పించిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని సరిమడుగు పంచాయతీ దిగువ సరిమడులో శ్రీ నడివీధి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేకువ జామునే అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలోని మహిళలు దివిటీలు, బోనాలను పెద్ద ఎత్తున ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. మేళతాళాలు, బాణాసంచాతో ఊరేగింపు సాగింది. గ్రామస్తులు రంగురంగుల విద్యుద్దీపాలంకరణతో అలంకరించిన చాందీని బండ్లను గ్రామం మొత్తం ఊరేగించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. జాతర సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు.

ఘనంగా తహలీల్ ఫాతెహా



ఎమ్మెల్యే నవాజ్‌బాషా, పీఠాధిపతి నూర్‌బాబాకు స్వాగతం పలుకుతున్న దర్గా కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ: స్థానిక బసినికొండలో వెలసిన బాబా హజరత్ అబ్దుల్ హుస్సేని దర్గా ఉరుసులో భాగంగా ఆదివారం తహలీల్ ఫాతెహా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి నూర్‌బాబా మజార్లకు పూల చాదర్లు సమర్పించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా హాజరయ్యారు. దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. దర్గాలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని దువా చేశారు. హిందూ, ముస్లింలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దర్గాలో కళాకారులు ఖవ్వాలీ పాటలు ఆలపించారు. కమిటీ సభ్యులు రియాజ్, సర్దార్, షామీర్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై నిఘా



మాట్లాడుతున్న సీఐ సురేష్

వాల్మీకిపురం: మండలంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెట్టాలని సీఐ సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శివరాత్రి సందర్భంగా పేకాట స్థావరాలపై నిఘా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు, దిశా చట్టాల గురించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై బిందుమాధవి, ఏఎస్సై లీలావతి, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు

రాయచోటి అర్బన్ : స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 28 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి రాయచోటి, లక్కిరెడ్డిపల్లె ప్రాంతాలతోపాటు చుట్టుపక్కల నియోజకవర్గాల నుంచి కూడా 80 మంది కంటి రోగులు వచ్చారు. వీరికి కంటివైద్యులు సురేష్, భార్గవి, మహాలక్ష్మి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డిలతో సిబ్బంది కంటి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో వైద్యులు 28మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించి ఆపరేషన్లు జరిపారు. గతంలో ఆపరేషన్‌లు నిర్వహించుకున్న 40 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వారికి ఉచిత కంటి అద్దాలు, మందులు అందజేశారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు చెన్నూరు అన్వర్‌బాషా, డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడ్డి, కంటి ఆసుపత్రి చైర్మన్ స్వరూప్‌గుప్తా, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

సాయిశతకం పుస్తకావిష్కరణ



సాయిశతకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

మదనపల్లె సిటీ: ప్రముఖ కవి, విద్యావేత్త డాక్టర్ బాడాల రామయ్య రచించిన సాయిశతకం పుస్తకాన్ని ఆదివారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఆవిష్కరించారు. ప్రముఖ రచయితలు రామయ్య రచించిన పుస్తకాన్ని పునర్ముద్రణ చేశారు. మదనపల్లె రచయితల సంఘం (మరసం) గౌరవ అధ్యక్షులు త్యాగమూర్తిశర్మ మాట్లాడుతూ రామయ్య తన 18 ఏటే 1944లోనే సాయి శతకం రాసి బాలకవిగా పేరుపొందినట్లు తెలిపారు. కొంత కాలం తరువాత ఆయన కుమారులు ముందుకు వచ్చి పునఃముద్రణ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక ఉపాధ్యక్షులు సుందరరామశర్మ, కవి కుమారులు శ్రీనివాసులు, నంజుడప్ప, నాగేశ్వరరావు, జ్ఞానోదయ పాఠశా కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు, మునిగోటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ తల్లికి విశేష పూజలు



తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకొంటున్న భక్తులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతానాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి వేకువ జాము నుంచే భక్తుల సందడి మొదలైంది. ఆలయకింది భాగంలోని దిగువ తొట్లివారిపల్లెలో పంపిణీ చేసే ఆకు పసరును సేవించిన మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. ఆలయ మెట్లకు పసుపుకుంకుమలు, కర్పూర హరతులతో పూజలు చేశారు. తులభారంతో బిడ్డలను తూచి అంత డబ్బులు అమ్మవారికి కానుకలుగా సమర్పించారు.

గర్నిమిట్ట యల్లమ్మకు బోనాల సమర్పణ



బోనాలు ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మ తల్లికి పెద్ద ఎత్తున భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆదివారం యల్లమ్మ తల్లికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. గర్నిమిట్ట పరిసర గ్రామాల నుంచి భక్తులు మంగళ వాయిద్యాల నడుమ బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, నాయకులు గౌస్, మహబూబ్‌బాషా, రమేష్, శశి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అర్చకులు, భక్తులు

మదనపల్లె సిటీ: మహాశివరాత్రి పురస్కరించుకుని స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆదివారం ఆలయం వద్ద ఆవిష్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆలూరు ఫణి కుమార్‌శర్మ మాట్లాడుతూ 16న బ్రహ్మోత్సవాలు గణపతి పూజతో ప్రారంభమవుతాయన్నారు. 17న ధ్వజారోహణం, మండప పూజ, సాయంత్రం నంది వాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న మహాశివరాత్రి పురస్కరించుకుని రాత్రి 12 నుంచి నాలుగు యామములు అభిషేక పూజలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుగుతుందన్నారు.

ఉదయం నుంచి భక్తులకు స్వామి సర్వదర్శనం కల్పిస్తామన్నారు. రాత్రి గిరిజా కళ్యాణం కనుల పండువగా జరుగుతుందన్నారు. 19న రుద్రాభిషేకం, సాయంత్రం శ్రీవారి శయనోత్సవం, 20న సుప్రభాత సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఎస్‌ఈబీ దాడుల్లో 110 లీటర్ల సారా స్వాధీనం



నాటుసారా రవాణా చేస్తూ పట్టుబడిన నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఈబీ పోలీసులు

మదనపల్లె : ఎస్‌ఈబీ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లో విస్తృతంగా జరిపిన దాడుల్లో 110 లీటర్ల నాటుసారా స్వాధీనంతో పాటు ఒకరిని అరెస్ట్‌చేసి మరొకరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఇన్స్‌పెక్టర్ శ్రీహరిరెడ్డి, ఎస్‌ఐ అంజాద్‌బాషా తెలిపారు. నాటుసారా రవాణా చేస్తున్న మేకలవారిపల్లె, వాల్మీకిపురం మండలంకు చెందిన కుక్కల గంగులప్పను అరెస్ట్‌చేసి 60 లీటర్ల నాటుసారా, సుజుకి యాక్సిస్ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా అక్రమంగా 50 లీటర్ల నాటుసారా రవాణాచేస్తూ హోండా యాక్టివా ద్విచక్రవాహనాన్ని, సారాను వదిలి పారిపోయిన మేకలవారిపల్లె వాల్మీకిపురం మండలానికి చెందిన ఎస్.చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హార్సిలీహిల్స్‌పై కొత్త అందాలు



బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై అటవీశాఖ ప్రాంగణంలో అధికారులు ఆధునీకీకరణ పనులు చేపట్టారు. ఇటీవల అటవీ పర్యావరణ సముదాయాన్ని రాజంపేట డీఎఫ్‌ఓ పళణి వివేక్ పరిశీలించారు. పర్యావరణ సముదాయంలోని నిర్మాణంపై ఐ లవ్ ఫారెస్ట్..ఐ లవ్ హార్సిలీహిల్స్ అని రాయించి..అడవిని, హార్సిలీకొండను ప్రేమిద్దామని పర్యాటకులకు పిలుపునిచ్చారు. అలాగే సముదాయంలోని ఊడల మర్రిచెట్టు కొమ్మ ఊగే ఊయల మాదిరి ఉంటుంది. దీనిపై పర్యాటకులు కూర్చుని ఫొటోలు తీసుకొంటుంటారు. ఈ కొమ్మపై పచ్చదనం ప్రాధాన్యత తెలిపేలా పెయింటింగ్ వేయించారు. దీనితో సముదాయంలో కొత్త అందాలు సంతరించుకొన్నాయి. కాగా సముదాయంలో మరిన్ని మార్పులకు చర్యలు తీసుకొంటున్నామని హార్సిలీహిల్స్ సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్ తెలిపారు.

అభివృద్ధి పథంలో పీలేరు పంచాయతీ



పీలేరు పట్టణంలో కాంతులీనుతున్న గ్లోబల్‌లైట్లు

పీలేరు : మేజర్ గ్రామ పంచాయతీ పీలేరును అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. శనివారం, ఆదివారం రెండు రోజులు పాటు పట్టణంలోని మదనపల్లె రోడ్డు, కడప రోడ్డు, చిత్తూరు రోడ్డు మార్గంలో డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలకు అధునాతన గ్లోబల్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అత్యంత కాంతివంతంగా, సుందరంగా ఉంచాలనే లక్ష్యంతో రూ. 2 లక్షలు వెచ్చించి గ్లోబల్ లైట్లు అమర్చినట్లు తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండు, పోలీస్‌స్టేషన్, ప్రభుత్వాస్పత్రి, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో కూడా లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ రెడ్డిప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.